క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

నస్పూర్: పట్టణ పరిధిలోని పలు సర్వే నంబర్లలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ కౌన్సిలర్లు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం సీపీఐ కౌన్సిలర్లు కలెక్టర్ బదావత్ సంతోష్‌కి సమర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పట్టణ పరిధిలోని నస్పూర్ శివారు సర్వే నంబర్ 42, 64, 72, 119లలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములలో అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇస్తున్నారన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరిపి సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డీఎల్‌పీవో ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

జన్నారం: మండలంలోని పొన్కల్ గ్రామ పంచాయతీని డీఎల్‌పీవో ధర్మరాణి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ.. వందశాతం పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో రమేశ్, ఈవో రాహుల్ ఉన్నారు.

ఎస్‌బీఐ ఎదుట నిరసన


నిరసన వ్యక్త చేస్తున్న సీపీఎం నాయకులు

చెన్నూర్: కేంద్ర ప్రభుత్వం ఎస్‌బీఐ ద్వారా సేకరించిన రూ.7వేల కోట్ల బాండ్లను రద్దు చేసి, బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. ఎస్‌బీఐ బాండ్ల సేకరణను నిరసిస్తూ సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చందు, ఉమారాణి, సమ్మక్క, నగేశ్, శ్రీనివాస్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మగా మారిందని సీపీఎం మండల కార్యదర్శి దాగం రాజారాం ఆరోపించారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని నిరసిస్తూ సీపీఎం నాయకులు సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రాజేశం, రాజన్న, మొగిలి, మల్లక్క, వరలక్ష్మి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


మాట్లాడుతున్న మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో రౌడీ షీటర్‌గా చలామని అయిన పలువురిని సోమవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ శశిధర్‌రెడ్డి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారితో మాట్లాడి గతంలో ఎందుకు నేరచరిత్ర కలిగి ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. ఇక ముందు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సమాజంలో మంచి గుర్తింపుతో జీవించాలని సూచించారు. పట్టణ ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై మల్లేశం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ బడ్జెట్‌పై సమావేశం


సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

లక్సెట్టిపేట: మున్సిపల్ కార్యాలయంలో 2023–24 ఆర్థిక సంవత్సరపు సవరణ బడ్జెట్, 2024–25వ సంవత్సరపు ఆర్థిక బడ్జెట్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్ రాహుల్ హాజరయ్యారు. ఈ సమావేశంలో జేఏవో అనితాదేవి వార్షిక బడ్జెట్ ఎజెండాను చదివి వినిపించారు. వార్డు కౌన్సిలర్ల సమక్షంలో రూ.12.14కోట్ల వార్షిక బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ కల్లెడ రాజశేఖర్, కో ఆప్షన్ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కంకర రోడ్డుపై కష్టాలు..!


కంకర తేలిన రోడ్డు

త్వరలోనే పూర్తి చేయిస్తాం



రోడ్డు వెడల్పు ముందుగా అనుకున్న దానికంటే ఎక్కువగా చేయాల్సి వస్తుంది. దీంతో కేటాయించిన నిధులు సరిపోవడం లేదు. అంచనా వ్యయం పెరిగింది. రోడ్డు వెడల్పు చేయడానికి ఉన్నతాధికారుల అనుమతికి ప్రపోజల్స్ పంపించాం. అధికారుల అనుమతి రాగానే నిధులు కేటాయించి త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేయిస్తాం.

– సీహెచ్ సతీష్, కమిషనర్

- ప్రయాణించాలంటే ప్రజల అవస్థలు
- ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలోని రాయల్ గార్డెన్ చౌరస్తా నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయం చౌరస్తా వరకు దాదాపు 400మీటర్ల మేర ఉన్న బీటీ రోడ్డును వెడల్పు చేసి సీసీ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం టీయూఎఫ్ఐడీసీ నిధులు సుమారు రూ.50లక్షలతో పనులు మొదలు పెట్టారు. రోడ్డును వెడల్పు చేసి రోడ్డుపై ఉన్న బీటీని తొలగించారు. సీసీ రోడ్డు వేయడానికి రోడ్డుపై కంకర పోసి రోడ్డు పనులు పూర్తి చేయకుండా దాదాపు నాలుగు నెలలుగా అసంపూర్తిగా వదిలి వేశారు. దీంతో రోడ్డుపై పోసిన కంకర పైకి తేలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సింగరేణి కార్మికులకు తప్పని ఇబ్బందులు..

నస్పూర్‌కాలనీ, షిర్కే, నాగార్జునా, న్యూనాగార్జునా కాలనీలలోని కార్మికులు ఈ రోడ్డుపై నుంచి గనుల కు విధులు నిర్వర్తించేందుకు చేరుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై కంకర తేలడంతో విధులకు వెళ్లి, వచ్చే సమయాల్లో తమ వాహనాల టైర్లకు కంకరు గుచ్చుకోవడంతో వాహనాలు తరుచూ పంచర్లు అవుతున్నాయని, దీంతో విధులకు ఆలస్యంగా వెల్లడం, ఒక్కోసారి గైర్హాజరు కావడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు వురికి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

'వారసంత' రోజు మరింత ఇబ్బంది..

రాయల్ గార్డెన్ సమీపంలోని ఖాళీ స్థలంలో ప్రతీ మంగళ, శనివారాలు వారసంత నిర్వహిస్తూ ఉంటా రు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తికాకపోవ డం, ఖాళీ స్థలం వ్యాపారులకు సరిపోకపోవడంతో చిరువ్యాపారులు ఇదే రోడ్డుకు ఇరువైపులా తమ దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తూ ఉంటారు. దీంతో కంకర తేలిన రోడ్డుపై నుంచి దుమ్ము, ధూలితో అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు


గంగారాం


ప్రసాద్


స్వరూప్‌రాజ్


విజయ్‌కుమార్


శ్యాంపటేల్

భీమిని: కన్నెపెల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సైగా గంగారాం, భీమిని పోలీస్‌స్టేషన్ ఎస్సైగా విజయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కన్నెపెల్లి పోలీస్ స్టేషన్‌లో ఇంతకుముందు పనిచేసిన ఎస్సై నరేష్ సాధారణ బదిలీల్లో భాగంగా దండేపల్లికి బదిలీపై వెళ్లారు. కాగా బదిలీపై వెళ్లిన నాలుగు రోజులకే నరేష్ కన్నెపల్లిలో విధులు నిర్వర్తించిన సమయంలో ఆరోపనలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేయడం పోలీస్‌శాఖలో అప్పుడు కలకలం రేపింది. ఆయన బదిలీపై వెళ్లడం, పైగా వెంటనే సస్పెండ్ కావడంతో పోలీస్‌స్టేషన్‌కు ఎవరూ పెద్ద దిక్కులేకుండా పోయింది. 27రోజుల పాటు కన్నెపెల్లి పోలీస్‌స్టేషన్‌కు ఎస్సై లేకపోవడంతో కానిస్టేబుళ్ల అడిందే ఆటా.. పాడిందే పాటగా సాగిందనే ఆరోపనలు వచ్చాయి. 'సాక్షి' దినపత్రికలో ఈ స్టేషన్‌కు బాస్ ఎవరో..? అనే కథనం ప్రచురణ కాగా స్పందించిన రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కాసిపేట ఎస్సైగా పనిచేసిన గంగారాంను కన్నెపెల్లికి బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. భీమిని ఎస్సైగా విజయ్ కుమార్ కూడా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

దండేపల్లి ఎస్సైగా స్వరూప్ రాజ్

దండేపల్లి: దండేపల్లి ఎస్సైగా ఎస్.స్వరూప్‌రాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన నరేష్ సస్పెన్షన్ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో పెద్దపల్లి సెంట్రల్ క్రైం ఎస్సైగా పనిచేసిన స్వరూప్‌రాజ్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

నీల్వాయి ఎస్సైగా శ్యాంపటేల్

వేమనపల్లి: నీల్వాయి ఎస్సైగా శ్యాంపటేల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎస్సై ఉపేందర్‌రావుకు వీడ్కోలు


ఎస్సై ఉపేందర్‌రావును సన్మానిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ బన్సీలాల్, ఎస్సైలు, సిబ్బంది

జైపూర్: ఇటీవల జరిగిన బదిలీల్లో మంచిర్యాల టాస్క్‌ఫోర్స్‌కు బదిలీపై వెళ్తున్న జైపూర్ ఎస్సై యు.ఉపేందర్‌రావుకు పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. జైపూర్ పోలీస్‌స్టేషన్లో సోమవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో బదిలీపై వెళ్తున్న ఎస్సై ఉపేందర్‌రావును ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పూలమాలలతో సత్కరించి శాలువాలతో సన్మానించారు. ఇటీవల బదిలీపై భూపాలపల్లి జిల్లా నుంచి వచ్చిన ఎస్సై శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సై సంతోశ్, భీమారం ఎస్సై రాములు, అదనపు ఎస్సై నాగరాజు, ఏఎస్సైలు అజీజ్, అబీబ్, బాలయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెల ఎస్సైగా ప్రసాద్

నెన్నెల: నెన్నెల మండల నూతన ఎస్సైగా కుందారపు ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్సైకి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

జీరో బిల్లులు పరిశీలన


సోమనపల్లిలో బిల్లు చూపిస్తున్న ట్రాన్స్‌కో డీఈ

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లిలో సోమవారం జీరో విద్యుత్ బిల్లులను ట్రాన్స్‌కో డీఈ కై జర్ పరిశీలించారు. మండలంలో జీరో విద్యుత్ బిల్లు రాని లబ్ధిదారులు చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, కరెంటు బిల్లు స్లిప్, రేషన్‌కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పాత బకాయిలు ఉన్న వారు బిల్లులు చెల్లించి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఏఓ శ్రీనివాస్, ఏడీఈ రవికుమార్, ఏఈ భాస్కర్, సిబ్బంది రత్నాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన


కళాశాల ఎదుట విద్యార్థులు, హబ్ సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం మహిళా సాధికారత హబ్ పని చేస్తుందని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సిక అన్నారు. జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని ఎస్ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాలలో మహిళా సాధికారత హబ్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బేటీ బచావో.. బేటీ పడావో, బాలికలు, మహిళల సంరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. లింగ వివక్ష, బాలిక విద్య, బాల్య వివాహాల నిరోధక చట్టం, గుడ్‌టచ్–బ్యాడ్ టచ్, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100, ఆడపిల్లల ప్రాధాన్యతకు 112నంబర్లకు సమాచారం అందజేసేలా చూడాలని, సుకన్య సంవృద్ధి యోజన, మిషన్ వాత్సల్య, ఆడపిల్లల ప్రాముఖ్యత, మహిళా సాధికారతపై చైతన్యం చేశారు. కార్యక్రమాల్లో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తొలగించాలి


వినతిపత్రం ఇస్తున్న గ్రీన్‌సిటీ కాలనీవాసులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ డంపింగ్ యార్డు వల్ల గ్రీన్‌సిటీ కాలనీలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దానిని అక్కడి నుంచి మరో చోటుకు తరలించేలా చూడాలని ఆ కాలనీ మహిళలు సోమవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో చిట్టంపెల్లి శైలజ, గీత, స్రవంతి, శోభారాణి, శృతి, శైలజారావ్ పాల్గొన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 22వ వార్డు సాయి హనుమాన్ నగర్‌లోని హనుమాన్ గుడి వెనుక నుంచి తొలగించి, మరో చోటుకు మార్చాలని కోరుతూ ఆ వార్డు కౌన్సిలర్ మెరుగు మహేశ్వరి మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ...

వేమనపల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పెద్ద చెరువు శిఖం, గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దస్నాపూర్‌కు చెందిన గ్రామస్తులు, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి కబ్జాలో ఉన్న భూమిని కాపాడాలని కోరారు. బీజేపీ నాయకులు దుర్గం పుల్లయ్య, కొమురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి


ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మంచిర్యాలటౌన్: పోషణ పక్షోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని రాంనగర్ సెక్టార్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల చిన్నారులు, గర్భిణులకు కలిగే లాభాలను వివరించారు. ప్రతి ఒక్కరూ సరైన పౌష్టికాహారం తీసుకోవాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచనదేవి, సతీశ్, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలక్ష్మి, కాంతకృష్ణ, సురేఖ, శారద, రమ, లావణ్య పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత చిన్నారుల తల్లులకు ఆరోగ్యవంతమైన పోషకాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత, చిన్నారుల తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని గూడెం సెక్టార్ పరిధిలోగల రాసపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్షోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. లెర్నింగ్ కార్నర్స్, అనుబంధ పోషకాహారం, పౌష్టికాహారం ప్రాముఖ్యతలను గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి పిల్లల తల్లులకు ఆట, పాటలతో అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. అంగన్‌వాడీ టీచర్ సునీత, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ప్రజాదర్బార్..!


అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వివరిస్తున్న అనిత


భీమారం: మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ


జన్నారం: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

- విధులకు ఎగనామం పెడుతున్న అధికారులు
- అర్జీలకు ముందుకు రాని ప్రజలు
- మండలాల్లో స్పందన కరువు

బెల్లంపల్లి: నేషనల్ హైవే 363ని ఆనుకుని అక్రమంగా, అనుమతి లేకుండా నిర్వహిస్తున్న వ్యాపారాలను అడ్డుకోవాలని బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మంద అనిత కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు అర్జీని అందజేసి సమస్య తీవ్రతను వివరించారు.

నెన్నెల: మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ గాడిలో పడటం లేదు. మండల వ్యాప్తంగా సుమారు 24శాఖల అధికారులు విధులు నిర్వర్తిస్తున్నా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు అధికారులు ఏడుగురే హాజరయ్యారు. తరచూ ఇదే పరిస్థితి ఉన్నా ఉన్నతాధికారుల అజమాయిషీ లోపంతో కీలకమైన అధికారులు ఎగనామం పెడుతున్నారు. సోమవారం జరిగిన ప్రజాదర్బార్‌కు ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్, ఐకేపీ ఏపీఎం విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, ఇరిగేషన్ జూనియర్ అసిస్టెంట్ రాము, ఏఈఓ రాంచందర్ హాజరయ్యారు. ప్రతి ప్రజాదర్బార్‌లో పది అంకెల హాజరు దాటడం లేదు. ప్రజావాణి తీరు మారకపోవడంతో సమస్యలకు పరిష్కారం దొరకదని భావించిన మండల ప్రజలు దరఖాస్తులు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. దీంతో ప్రజాదర్బార్‌కి స్పందన కరువైంది. కుశ్నపల్లి నుంచి భూసమస్యలకు సంబంధించిన ఐదు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎంపీడీవో రాధ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ వారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌ని ఆదరించాలని కోరారు. అధికారులు పాల్గొన్నారు.

జన్నారం: ప్రజాదర్బార్‌లో దరఖాస్తు రూపంలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీజేఈ సతీష్, ఇరిగేషన్ జేఈ రాజు, ఏపీఎం రచన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఉన్నారు.

కోటపల్లి: మండలంలో ప్రజాదర్బార్ మొక్కుబడిగా సాగింది. అధికారులు సమయపాలన పాటించకపోవడం, హాజరైన అధికారులు రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోవడంతో సమస్యలు చెప్పేందుకు వచ్చే ఫిర్యాదుదారులు వెనుదిరిగిపోయారు.

మందమర్రిరూరల్: మందమర్రిలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీవో భీరయ్య, పలు విభాగాల అధికారులు ఉన్నారు.

తాండూర్: దళిత గిరిజనులకు కేటాయించిన భూమిని కొందరు ఆక్రమించుకుని అన్యాయం చేస్తున్నారని, తమ భూమి తమకు కేటాయించి న్యాయం చేయాలని తాండూర్ మండలం నీలాయపల్లి గ్రామానికి చెందిన దళితులు, ఆదివాసీలు విన్నవించుకున్నారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో దరఖాస్తు సమర్పించారు. దరఖాస్తు సమర్పించిన వారిలో పెంటయ్య, చిన్నక్క, మురళి, సాయి, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

మేమంతా మోదీ 'బలగమే'


జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


దండేపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

- ప్లకార్డులతో ర్యాలీలు నిర్వహించిన బీజేపీ నాయకులు

దండేపల్లి/నస్పూర్/లక్సెట్టిపేట/మంచిర్యాల టౌన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై లాలూ ప్రసాద్ యాదవ్ కించపరిచేలా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మోదీకి కుటుంబమే లేదంటూ, ఇండియా కూటమి చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. జిల్లా కేంద్రంలో, దండేపల్లిలో, నస్పూర్‌లో, లక్సెట్టిపేటలో మేమంతా మోదీ బలగమే అంటూ బీజేపీ నాయకులు మోదీకి మద్దతుగా సోమవారం ప్లకార్డులతో ర్యాలీలు నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అంతా మోదీ కుటుంబ సభ్యులమే అని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ కార్యదర్శి బోయిని హరికృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ తోట మల్లికార్జున్, కర్రె లచ్చన్న, గాజుల ప్రభాకర్, కాశెట్టి నాగేశ్వర్‌రావు, బుద్దారం రాజమౌళి, కంకణాల సతీశ్, అమిరిశెట్టి రాజు, పల్లె రాకేశ్ రెన్వా, దుర్గాప్రసాద్, దండేపల్లిలో బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజయ్య, రవిగౌడ్, మాజీ రైతు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, నస్పూర్‌లో పట్టణ అధ్యక్షుడు సత్రం రమేష్, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యాసాగర్‌రావుకు సన్మానం

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల శ్రీ మల్లన్న స్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు చేసిన వేలాల గ్రామ ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాల విద్యాసాగర్‌రావును స్థానిక యువకులు, ప్రజలు సోమవారం ఘనంగా సన్మానించారు.

ప్రపంచ ప్లంబర్స్ డే

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ పంక్షన్ హాల్లో సోమవారం ప్రపంచ ప్లంబర్స్ డే ను ప్లంబర్స్ అండ్ సానిటరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కోటపల్లి: కుష్ఠువ్యాధి నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డాక్టర్ సత్యనారాయణ అన్నారు. కోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. 11నుంచి 24వరకు వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేపట్టాలని సూచించారు.

టీఎన్జీవోస్ డైరీ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మంచిర్యాల జిల్లా డైరీ, క్యాలెండర్లను జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.

మార్కెట్‌లో టాయిలెట్లు ప్రారంభం

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తన సొంత ఖర్చుతో నిర్మించిన టాయిలెట్లను సోమవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, మార్కెట్ అధ్యక్షుడు తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

కన్నెపల్లిలో వైద్య శిబిరం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట పల్లెదవాఖాన, అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కన్నెపల్లిలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 42మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి జ్వరం ఉన్నట్లు నిర్ధారించి మందులు అందజేశారు.